సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం । 13 । మే । 2025



అందరి చూపూ ఖమ్మం వైపే..

ఉమ్మడి జిల్లాలోని ముగ్గురు మంత్రులు చేస్తున్న అభివృద్ధితో రాష్ట్రమంతా ఖమ్మం వైపే చూస్తోందని ఎంపీ రఘురాంరెడ్డి అన్నారు. 8లో



సమ్మెకు సన్నద్ధం

ఈనెల 20న దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగ పరిశ్రమల పరిరక్షణకు జాతీయ కార్మిక సంఘాలు సమ్మెకు పిలుపునిచ్చాయి. 8లో

గరిష్టం / కనిష్టం
42° / 28°

వాతావరణం

జిల్లాలో మంగళవారం అధిక ఉష్ణోగ్రత నమోదవుతుంది. ఉదయం మొదలయ్యే ఎండ మధ్యాహ్నానికి తీవ్రమవుతుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు ముత్తంగి అలంకరణ



లక్ష్మీనృసింహస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారు సోమవారం ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన, తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులను బేడా మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించాక స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్య కల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

కమనీయం.. నృసింహ కల్యాణం

శ్రీసీతారామచంద్ర స్వామి వారి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీ యోగానంద లక్ష్మీనృసింహ స్వామి వారి తిరు కల్యాణ వేడుక వైశాఖ పౌర్ణమి సందర్భంగా సోమవారం కమనీయంగా జరిగింది. మొదట విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించిన అర్చకులు.. వేద మంత్రాల నడుమ కల్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ఈఓ స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు.

వైభవంగా చండీహోమం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారి ఆలయంలో సోమవారం వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని వైభవంగా చండీహోమం నిర్వహించారు. ముందుగా మేళతాళాలు, వేదమంత్రాలతో స్వామివారిని ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం మండపారాధన, గణపతిపూజ తర్వాత హోమం, చివరన పూర్ణాహుతి నిర్వహించారు. హోమంలో పాల్గొన్న 17 మంది భక్త దంపతులకు అర్చకులు అమ్మవారి శేష వస్త్ర ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈఓ రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన కళాశాలల్లో ప్రవేశానికి కౌన్సెలింగ్

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలల్లో మొదటి సంవత్సరం ప్రవేశాలకు స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు పీఓ బి.రాహుల్ తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని కళాశాల్లో సీటభర్తీ కోసం ఈనెల 15న బాలికలకు, 16న బాలురకు స్పాట్ కౌన్సెలింగ్ ఉంటుందని వెల్లడించారు. నిర్ణీత తేదీల్లో భద్రాచలంలోని గిరిజన గురుకుల పాఠశాల, కళాశాలల్లో ఉదయం 9గంటలకు మొదలయ్యే కౌన్సెలింగ్‌కు 2024–25లో పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. వివరాలకు 94909 57271, 94909 57270 నంబర్లలో సంప్రదించాలని పీఓ తెలిపారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న డీఏఓ బాబూరావు

సుజాతనగర్: ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబూరావు కోరారు. సుజాతనగర్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు ప్రైవేట్ వ్యాపారులకు, దళారులకు ధాన్యం తక్కువ ధరకు అమ్మి నష్టపోవద్దని సూచించారు. రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని సిబ్బందిని ఆదేశించారు. ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ధాన్యం, రైతుల వివరాలు, మిల్లర్లకు తరలిన ధాన్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఓ నర్మద, టెక్నికల్ ఏఓ నాగయ్య, సాయినారాయణ, విజయ్‌భాస్కర్ రెడ్డి, ఏఈఓలు ప్రనూష, నరసింహ, శరత్ తదితరులు పాల్గొన్నారు.

హామీతోనే సరి!



గత శనివారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో మంత్రులు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య



సీతారామ ప్రాజెక్ట్‌పై ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో ఇల్లెందు నియోజకవర్గానికి న్యాయం చేస్తామని ప్రభుత్వం నుంచి హామీ దక్కింది. అయితే ఈ హామీ అమలు అయ్యేందుకు అనేక అడ్డంకులు ఉన్నాయి. వీటన్నింటినీ అధిగమించి ఇల్లెందుకు నీరు దక్కాలంటే మరి కొన్నేళ్లు ఎదురు చూడక తప్పని పరిస్థితి నెలకొంది.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

ఇల్లెందు నియోజకవర్గానికి 'సీతారామ' నీటిపై చర్చ

- పాలేరు లింక్ – లలితాపురం ప్రణాళిక వైపే మొగ్గు
- గతంలో చేపట్టిన రాజీవ్ సాగర్ మార్గంపై అనాసక్తి
- పాలేరు లింక్ నుంచి నీరందాలంటే అనేక అడ్డంకులు

పాత డీపీఆర్‌కే మొగ్గు..

సీతారామ బహుళార్థ సాధక ప్రాజెక్టు ద్వారా ఇల్లెందు నియోజకవర్గానికి లబ్ధి జరగడం లేదని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఈ అంశంపై ప్రత్యేకంగా సమావేశం నిర్వహించాలనే సీఎం సూచన మేరకు గత శనివారం హైదరాబాద్‌లో చర్చించారు. గత ప్రభుత్వ హయాంలో ప్రతిపాదించిన ప్రణాళిక ప్రకారం ఇల్లెందుకు సాగు నీరు అందిస్తామని ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. అయితే 'దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో చేపట్టిన రాజీవ్‌సాగర్ డిజైన్‌ను అనుసరించి గోదావరి నుంచి కిన్నెరసాని మీదుగా రోళ్లపాడు వరకు నీటిని పైపుల ద్వారా తీసుకురావాలి' అని గుమ్మడి నర్సయ్య కోరగా.. దీనిపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాలేదు.

గత ప్రభుత్వ హయాంలో..

జలయజ్ఞంలో భాగంగా మహానేత వైఎస్సార్ మొదలుపెట్టిన రాజీవ్‌సాగర్ ప్లాన్‌కు కొద్ది మార్పులు చేస్తూ రోళ్లపాడు దగ్గర పది టీఎంసీల సామర్థ్యంతో జలాశయం నిర్మించి అక్కడి నుంచి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పది నియోజకర్గాలకు సాగునీరు ఇవ్వాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు 2016 ఫిబ్రవరిలో నాటి సీఎం కేసీఆర్ రోళ్లపాడు వద్ద సీతారామ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. అయితే గోదావరి నీరు రోళ్లపాడుకు తీసుకొచ్చే క్రమంలో కిన్నెరసాని అభయారణ్యం ఉండడం, అనుమతుల సాధన క్లిష్టంగా మారడంతో ఈ ప్లాన్‌ను పూర్తిగా రద్దు చేశారు. ప్రాజెక్టుకు 2018లో రీడిజైనింగ్ చేశారు. దీంతో ఇల్లెందు నియోజకవర్గానికి సీతారామ ద్వారా నీరు వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. ఎట్టకేలకు ఇల్లెందు నియోజకర్గానికి గోదావరి నీళ్లు ఇచ్చేందుకు 2023లో మరో ప్రణాళిక సిద్ధం చేశారు. ఇంతలో ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో ఈ అంశం మరుగున పడింది.

ఇల్లెందు ప్రణాళిక ఇలా..

వివిధ దశల్లో ఎత్తిపోతల ద్వారా గోదావరి జలాలు జూలూరుపాడు కెనాల్ ద్వారా ఇల్లెందు శివారులో ఉన్న సింగరేణి (కారేపల్లి) మండలం లలితాపురం చెరువుకు చేరుకుంటాయి. అక్కడి నుంచి ఎత్తిపోతల ద్వారా 216 అడుగుల ఎత్తులో ఉన్న రోళ్లపాడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు చేరుకుంటాయి. అక్కడి నుంచి ఒక కాల్వ ద్వారా టేకులపల్లి, లక్ష్మీదేవిపల్లి మండలాలకు, మరో కాలువ ద్వారా బయ్యారం పెద్ద చెరువుకు నీటిని తరలిస్తారు. అక్కడి నుంచి మహబూబాద్ జిల్లాలోని గార్ల, బయ్యారం, డోర్నకల్ మండలాలకు సాగునీరు అందించేలా ప్రాజెక్టును డిజైన్ చేశారు. ఈ రెండూ కాకుండా జూలూరుపాడు కెనాల్ – లలితాపురం రిజర్వాయర్‌ను ఆధారంగా చేసుకుని రఘునాథపాలెం, సింగరేణి, ఖమ్మం అర్బన్ మండలాల్లోని గ్రామాలకు నీరు అందిస్తారు. మొత్తంగా ఇల్లెందు నియోజకవర్గం కోసం ప్రత్యేకంగా రూపొందించిన ప్రణాళిక ప్రకారం భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాద్ జిల్లాల పరిధిలో కొత్తగా 1.05 లక్షల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉంది. ఇందుకోసం రూ.3,200 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు.

అడ్డంకులు అధిగమిస్తేనే..

ఇప్పటికే సీతారామ ప్రాజెక్టు అంచనా వ్యయం విపరీతంగా పెరిగిందనే భావన ప్రభుత్వంలో నెలకొంది. సత్తుపల్లి ట్రంక్ కెనాల్‌లో కీలకమైన యాతాలకుంట టన్నెల్ పూర్తి చేసి అశ్వారావుపేట, సత్తుపల్లి నియోజకవర్గాలకు నీరు అందించడమే ప్రభుత్వ తక్షణ కర్తవ్యంగా ఉంది. ఆ తర్వాత దశలో పాలేరు లింక్ కెనాల్‌పై దృష్టి పెట్టనుంది. అటవీశాఖ అనుమతుల కారణంగా పాలేరు లింక్ కెనాల్‌లో పది కిలోమీటర్ల పొడవైన జూలూరుపాడు టన్నెల్ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. అనుమతులు సాధించి, ప్రభుత్వం నిధులు కేటాయించి, ఈ టన్నెల్ నిర్మాణం పూర్తయితేనే గోదావరి నీరు పాలేరు జలాశయానికి వెళ్తాయి. ఆ మధ్యలో కొత్తగా ఒక ఎత్తిపోతలను చేపట్టి గోదావరి జలాలను ఇల్లెందు సమీపంలోని లలితాపురం చెరువు తరలించాల్సి ఉంటుంది. అప్పుడే ఇల్లెందు ప్లాన్‌కు ప్రాణం వస్తుంది. అప్పటి వరకు ఈ ప్రణాళిక కాగితాలకే పరిమితం అవుతుందని ఆ ప్రాంత వాసులు అంటున్నారు.

భూ భారతి దరఖాస్తులపై విచారణ చేపట్టాలి

అధికారులకు కలెక్టర్ ఆదేశం



దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

సుజాతనగర్: భూ భారతి చట్టం కింద రైతులు, ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మండలంలోని మంగపేట, లక్ష్మీదేవిపల్లి గ్రామాల్లో సోమవారం నిర్వహించిన సదస్సుల్లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ మార్గదర్శకాలు పాటిస్తూ, నూతన ఆర్ఓఆర్ చట్టంలో పొందుపరిచిన నిబంధనలకు అనుగుణంగా పరిష్కరించాలని ఆదేశించారు. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని, మొక్కుబడిగా కాకుండా ప్రతి అంశాన్ని జాగ్రత్తగా తనిఖీ చేయాలని సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాలు, భూ భారతి చట్టం నిబంధనలపై అధికారులకు సరైన అవగాహన ఉంటేనే తప్పులకు తావులేకుండా ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శిరీష, ఆర్ఐలు కాంతారావు, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఐటీడీఏ పీఓ రాహుల్



దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న పీఓ రాహుల్

భద్రాచలంటౌన్: అర్హులైన గిరిజనులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు కృషి చేస్తారని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. స్థానిక ఐటీడీఏలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఆయన వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోడు, వ్యక్తిగత భూములకు పట్టాలు, రైతుభరోసా, స్వయం ఉపాధి పథకాలకు రుణాలు, దీర్ఘకాలిక వ్యాధులకు చికిత్స కోసం ఆర్థిక సాయం తదితర అవసరాల కోసం గిరిజనులు దరఖాస్తులు ఇచ్చారని, ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అధికారులకు సూచించారు. గిరిజన దర్బార్‌లో వచ్చిన అర్జీలన్నీ ఆన్‌లైన్‌లో ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేసి, అర్హులకు విడతల వారీగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడానికి చర్యలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ డేవిడ్ రాజ్, డీడీ మణెమ్మ, ఈఈ చంద్రశేఖర్, అధికారులు అరుణకుమారి, రవీంద్రనాథ్, భాస్కరన్, వేణు, లక్ష్మీనారాయణ, ఉదయ్, నరేష్, ఆదినారాయణ, నారాయణరావు, హరికృష్ణ, లింగా నాయక్ పాల్గొన్నారు.

నేడు డిప్యూటీ సీఎం పర్యటన



సబ్‌స్టేషన్ శంకుస్థాపన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

టేకులపల్లి: టేకులపల్లి మండలంలో మంగళవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఏర్పాట్లను సోమవారం ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పరిశీలించారు. బేతంపూడి దర్గా నుంచి మద్దిరాలతండా వరకు బీటీ రోడ్డు, ముత్యాలంపాడు క్రాస్‌లో 33/11కేవీ సబ్ స్టేషన్ నిర్మాణానికి డిప్యూటీ సీఎం, మంత్రి శంకుస్థాపన చేస్తారని తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఏఈలు దేవా, బుజ్జి కన్నయ్య, సీఐ సురేష్, ఏఎస్ఐ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు. కాగా, మండలంలోని తూర్పుగూడెం గ్రామవాసులు ఆదివారం ఓ వివాహ వేడుకకు వెళ్తుండగా వాహనం అదుపు తప్పి గాయపడ్డారు. ఈమేరకు క్షతగాత్రులను ఎమ్మెల్యే పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. నాయకులు కోరం సురేందర్, మురళి, పోశాలు, సుధాకర్, వీరభద్రం, రాందాస్, నాని, భద్రు, హనుమంతు, భాస్కర్, రాజు, సర్వయ్య, సుదీప్ పాల్గొన్నారు.

ప్రజావాణి సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

అదనపు కలెక్టర్ వేణుగోపాల్



ప్రజావాణిలో సమస్యలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్


సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజావాణిలో వచ్చిన ప్రతీ దరఖాస్తును నిశితంగా పరిశీలించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి హాజరైన ప్రజలు సమస్యలపై దరఖాస్తులు అందజేయగా.. వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆయన ఎండార్స్ చేశారు.

దరఖాస్తుల్లో కొన్ని..

- కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని గాజుల రాజం బస్తీకి చెందిన దివ్యాంగులు ఆగుళ్ల మల్లేశం.. వీధి వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న తనకు దివ్యాంగుల కోటాలో వాహనం మంజూరు చేయాలని దరఖాస్తు చేయగా డీడబ్ల్యూఓకు ఎండార్స్ చేశారు.
- తమ తాత నుంచి వారసత్వంగా వచ్చిన పట్టా భూమి(సర్వే నంబర్ 251, 258) సాగు చేసుకుంటున్నామని, అయితే వారసులు కాని కొందరు ఆ నంబర్లపై పట్టాలు తీసుకున్నారని, రైతుబంధు కూడా పొందారని ములకలపల్లి మండలం చాపరాలపల్లికి చెందిన బానోత్ కొండమ్మ, బానోత్ ప్రతాప్, బానోత్ లచ్చీరామ్, బానోత్ భరత్‌కుమార్ ఫిర్యాదు చేశారు. తమకు రైతు భరోసా వచ్చేలా పట్టా ఇప్పించాలని దరఖాస్తు చేయగా ములకలపల్లి తహసీల్దార్‌కు ఎండార్స్ చేశారు.

కేసుల్లో సమగ్ర దర్యాప్తు చేపట్టాలి

నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ రోహిత్‌రాజు



మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెంఅర్బన్: ప్రతి కేసులో సమగ్ర దర్యాప్తు చేపట్టి నేరస్తులకు శిక్ష పడేలా అధికారులు కృషి చేయాలని ఎస్పీ రోహిత్‌రాజు సూచించారు. సోమవారం నిర్వహించిన నెలవారీ నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసుల విచారణలో జాప్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. పోలీస్ అధికారులంతా బాధ్యతగా వ్యవహరించాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై క్రమశిక్షణా చర్యలు తప్పవన్నారు. పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ వాహనాలతో అధికారులు, సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు, మట్కా, జూదం లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా హాట్ స్పాట్లను గుర్తించి గంజాయి రవాణా చేసేవారితో పాటు సేవించే వారిపైనా కేసులు నమోదు చేయాలని, కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్ల పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. సీసీ కెమెరాలపై ప్రజలకు అవగాహనకల్పించి, వారి నివాస ప్రాంతాల్లోనూ ఏర్పాటు చేసుకునేలా చూడాలన్నారు. పోలీసు శాఖ వినియోగిస్తున్న సాంకేతికతను ఉపయోగించి నేరస్తులను పట్టుకోవాలని, రికవరీ చేసిన సొత్తును బాధితులకు త్వరగా అందేలా చూడాలని చెప్పారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తుండాలన్నారు. ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి(బ్లాక్ స్పాట్స్) వాటి నివారణకు సంబంధిత అధికారులతో సమన్వయం పాటించాలని సూచించారు. పెండింగ్‌కేసుల సత్వర పరిష్కారానికి న్యాయాధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. సమావేశంలో కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు, మణుగూరు డీఎస్పీలు రెహమాన్, సతీష్‌కుమార్, చంద్రభాను, రవీందర్ రెడ్డి, డీసీఆర్బీ డీఎస్పీ మల్లయ్య స్వామి పాల్గొన్నారు.

ఓపెన్ టెన్నిస్‌లో పాల్వంచ క్రీడాకారుల సత్తా



సాధించిన పతకాలతో క్రీడాకారులు

పాల్వంచ: రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ఈనెల 11న విజయవాడలో నిర్వహించిన ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో పాల్వంచ క్రీడాకారులు ప్రతిభ కనబర్చారు. 60 సంవత్సరాలు పైబడిన విభాగంలో అన్నం వెంకటేశ్వర్లు టీం, 40 సంవత్సరాలు పైబడిన విభాగంలో భాస్కర్ రావు, కబీర్‌దాస్, 30 సంవత్సరాలు పైబడిన విభాగంలో సతీష్, కృష్ణ జట్లు రన్నర్‌లుగా నిలిచి పతకాలు సాధించాయి. ఆయా క్రీడాకారులను జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు యుగంధర్ రెడ్డి సోమవారం అభినందించారు.

ఆర్టీసీ అభివృద్ధికి ప్రణాళికలు

- త్వరలో గుండాల నుంచి హైదరాబాద్‌కు బస్సు
- భూపాలపల్లి, కాళేశ్వరానికి కూడా సర్వీస్‌లు
- ఆర్టీసీ ఈడీ సొలోమన్



ఇల్లెందులో ఈడీకి స్వాగతం పలుకుతున్న ఆర్ఎం సరిరామ్ తదితరులు

ఇల్లెందు/చుంచుపల్లి: ప్రయాణికుల సహకారం, ఉద్యోగులు, సిబ్బంది సమష్టి కృషితో ఆర్టీసీ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని సంస్థ కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సోలోమన్ తెలిపారు. సోమవారం ఆయన ఇల్లెందు, కొత్తగూడెం బస్టాండ్లు, డిపోలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డిపోల్లో బస్సుల నిర్వహణ, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ఆర్టీసీని బలోపేతం చేయడంలో సిబ్బంది కృషి అభినందనీయమన్నారు. ప్రయాణికుల సమస్యలు తీర్చడమే సంస్థ ప్రధాన కర్తవ్యమని, ప్రతి మారుమూల ప్రాంతాలకు బస్సు సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. డిమాండ్ మేరకు కొత్త రూట్లను ఎంపిక చేసి, ఆదాయం పెంచుకోవాలని ఉద్యోగులకు సూచించారు. బస్టాండ్లలో తాగునీరు, పారిశుద్ధ్యం వంటి చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఇల్లెందు డిపోలో 25 బస్సులు ఉన్నాయని, నిత్యం 9,500 కిలోమీటర్లు ప్రయాణించడం ద్వారా రూ.5 లక్షల వరకు ఆదాయం సమకూరుతోందని అధికారులు వివరించారు. అనంతరం ఈడీ విలేకరులతో మాట్లాడుతూ గుండాల నుంచి హైదరాబాద్‌కు బస్సు సర్వీసు నడిపించాలని, ఇల్లెందు నుంచి హైదరాబాద్‌కు ఏసీ సర్వీస్‌తో పాటు గుండాల నుంచి భూపాలపల్లి, కాళేశ్వరానికి బస్సులు నడిపించాలని అధికారులకు సూచించారు. ఇల్లెందు – గుండాల – మణుగూరుకు పల్లె వెలుగు, ఇల్లెందు – టేకులపల్లి – బోడు – టేకులపల్లి, గుండాలకు చెట్టుపల్లి మీదుగా సర్వీసులు నడిపించాలన్నారు. బస్ స్టేషన్‌లో పెట్రోల్ బంక్ ఏర్పాటుకు షాపులను తొలగించాల్సి వస్తోందని, ఆయా వ్యాపారులకు ఇచ్చిన గడువు సోమవారంతో ముగిసినందున ఇంకా తొలగించని షాపులను తామే కూల్చివేస్తామని ప్రకటించారు. అనంతరం మొక్కలు నాటారు. ఆయా కార్యక్రమాల్లో ఆర్ఎం సరిరామ్, డీఎం దేవేందర్‌గౌడ్, డిప్యూటీ ఆర్ఎం మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

వేదిక.. భారమిక!

- రైతు వేదికలకు 30 నెలలుగా అందని నిధులు
- విద్యుత్, ఇంటర్నెట్ బిల్లులకూ కటకటే
- తాగునీరు, పారిశుద్ధ్య పనులకు తప్పని ఇక్కట్లు

బూర్గంపాడు: రైతు వేదికల నిర్వహణ వ్యవసాయ అధికారులకు భారంగా మారింది. 30 నెలలుగా నిధులు విడుదల కాకపోవడంతో పారిశుద్ధ్య పనులు, తాగునీరు, విద్యుత్, ఇంటర్నెట్ బిల్లుల చెల్లింపులకు ఇబ్బందులు తప్పడం లేదు. పెండింగ్ బిల్లులు విడుదల కాకుంటే రైతు వేదికలు నిర్వహిస్తున్న ఏఈఓలకు ఆర్థిక భారం మరింతగా పెరగనుంది.

సత్వర సేవల కోసం..

పంటల సాగులో రైతులకు సత్వర సేవలు అందించేందుకు గత ప్రభుత్వం 5 వేల ఎకరాల విస్తీర్ణానికి ఓ క్లస్టర్‌గా ఏర్పాటు చేసి రైతు వేదిక నిర్మించింది. ప్రతీ రైతు వేదికకు ఒక వ్యవసాయ విస్తరణ అధికారి(ఏఈఓ)ని నియమించి రైతులకు ప్రభుత్వ పరంగా సేవలు అందించే ఏర్పాట్లు చేసింది. క్రాప్ బుకింగ్ మొదలు పంటల సాగులో నూతన విధానాలు, వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకాలకు సంబంధించి ఆన్‌లైన్ ప్రక్రియ వంటి పలు సేవలను ఈ వేదికల ద్వారా వ్యవసాయ శాఖ అధికారులు అందిస్తున్నారు. అంతేకాక వ్యవసాయంలో నూతన సాంకేతిక పద్ధతులు, విత్తనాల ఎంపిక, పంటల సస్యరక్షణ, వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకాలపై ప్రతి మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తూ రైతులకు అవగాహన కల్పిస్తోంది. ఇంతవరకూ బాగానే ఉన్నా.. రైతు వేదికలకు సకాలంలో నిధులు రాక తాగునీరు, పారిశుద్ధ్య పనులు, విద్యుత్ బిల్లులు, ఇంటర్నెట్ బిల్లులు, స్టేషనరీ తదితర అవసరాలకు ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గత ప్రభుత్వం ఒక్కో రైతు వేదికకు నెలకు రూ.9వేల చొప్పున 2022 ఆగస్టు వరకు నిధులు విడుదల చేసింది. అయితే గత 30 నెలలుగా రైతు వేదికల నిర్వహణకు నిధులు మంజూరు కావడం లేదు. దీంతో వ్యవసాయశాఖ అధికారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. వేదికలకు అవసరమైన ఫర్నిచర్, ఇతర వసతులను స్థానిక వ్యవసాయశాఖ అధికారులు దాతల సహకారంతో సమకూర్చుకున్నారు. కానీ వాటి నిర్వహణకు నిధులు రాకపోవడంతో అధికారులకు ఆర్థిక భారం తప్పడం లేదు. విద్యుత్ బిల్లులు చెల్లించకుంటే సరఫరా నిలిపేస్తున్నారని, ఇంటర్నెట్ బిల్లు కట్టకుంటే నెట్ రావడం లేదని వ్యవసాయ శాఖ అధికారులు వాపోతున్నారు. ప్రతీనెల తమ వేతనంలో నుంచే విద్యుత్, ఇంటర్నెట్ బిల్లులు చెల్లిస్తున్నామని చెబుతున్నారు. రైతు వేదికలను ప్రతిరోజు శుభ్రం చేసి, తాగునీరు పెట్టేందుకు ఓ వర్కర్‌ను నియమించుకున్నామని, వారి జీతభత్యాలు కూడా తమ చేతి నుంచే చెల్లించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బకాయిలు రూ.1.78 కోట్లు..

జిల్లాలో 66 రైతు వేదికలున్నాయి. వీటి నిర్వహణకు నెలకు గత ప్రభుత్వం ప్రకటించిన రూ. 9 వేల చొప్పున మొత్తం రూ.1,78,20,000 మంజూరు చేయాల్సి ఉంది. ఈ నిధులు మంజూరు చేస్తే వ్యవసాయశాఖ అధికారులకు కొంత ఊరట దక్కుతుంది. ప్రస్తుతం ఏఓ, ఏఈఓలు ప్రతి నెల విద్యుత్, ఇంటర్నెట్ బిల్లులతో పాటు వర్కర్‌కు వేతనం చెల్లిస్తున్నారు. అంతేకాక ప్రతి మంగళవారం రైతు వేదికలో నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులకు స్నాక్స్, తాగునీరు అందించాలని ప్రభుత్వం సూచించింది. దీనికి కూడా అధికారులే సొంత డబ్బు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఈ ఇబ్బందులను అధిగవించాలంటే ప్రభుత్వం రైతు వేదికల నిర్వహణకు నిధులు మంజూరు చేయాలని అధికారులు, రైతులు కోరుతున్నారు.



బూర్గంపాడులోని రైతు వేదిక

క్లుప్తంగా

నేటి నుంచి ఉపాధ్యాయులకు శిక్షణ



మాట్లాడుతున్న డీఈఓ వెంకటేశ్వరాచారి

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని ఉపాధ్యాయులకు ఈ నెల 13 నుంచి 30 తేదీ వరకు మూడు విడతలుగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి తెలిపారు. సోమవారం శిక్షణ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడారు. జిల్లాలోని 4,159 మంది ఉపాధ్యాయులకు విడతకు ఐదు రోజుల చొప్పున జిల్లా స్థాయిలో, మండల స్థాయిలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. రాష్ట్రస్థాయిలో శిక్షణ పొందిన 48 మంది ఉపాధ్యాయులతో ఇక్కడ శిక్షణ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. శిక్షణకు వచ్చే ఉపాధ్యాయులకు మధ్యాహ్న భోజన వసతి కూడా కల్పించామని, అందరూ ఉదయం 9:30 గంటలలోపే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ ద్వారా హాజరు నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ జిల్లా కో–ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

సింగరేణి క్రికెట్ టోర్నీ విజేత బెల్లంపల్లి

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని జయశంకర్ గ్రౌండ్‌లో మూడు రోజులపాటు జరిగిన సింగరేణి ఎగ్జిక్యూటివ్ క్రికెట్ టోర్నీలో బెల్లంపల్లి రీజియన్ జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం రాత్రి జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో కొత్తగూడెం జట్టుపై విజయం సాధించింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డైరెక్టర్ (ఈ అండ్ ఎం) సత్యనారాయణ రావు హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. మహిళా విభాగంలో కొత్తగూడెం జట్టు విజేతగా నిలవగా, బెల్లంపల్లి టీమ్ రన్నర్‌గా నిలిచింది. ఈ కార్యక్రమంలో జీఎంలు ఎం.శాలేంరాజు, మనోహర్‌తోపాటు కోటిరెడ్డి, పాలడుగు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ గడువు పొడిగింపు

25 శాతం రాయితీతో

ఈనెల 31వరకు అవకాశం

ఖమ్మంమయూరిసెంటర్: ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులు ఫీజు చెల్లించే గడువును ప్రభుత్వం ఈనెల 31వ తేదీ వరకు పొడిగించింది. ఫీజు చెల్లింపులో 25 శాతం రాయితీ కల్పిస్తూ ప్రభుత్వం రెండు నెలల క్రితం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ గడువు ఈనెల 3తో ముగియగా.. మరోసారి పెంచుతూ ప్రభుత్వ కార్యదర్శి కె.ఇలంబర్తి పేరిట సోమవారం ప్రకటన విడుదలైంది. దీంతో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులు 25శాతం రాయితీ పొందేందుకు మరో అవకాశం లభించింది. తద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు మున్సిపాలిటీల నుండి ప్రభుత్వానికి మరింత ఆదాయం సమకూరుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

పౌర రక్షణ వలంటీర్లుగా నమోదు చేసుకోవాలి

ఖమ్మం రాపర్తినగర్: భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యాన పౌర రక్షణ వలంటీర్లుగా నమోదుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నందున యువత సద్వినియోగం చేసుకోవాలని నెహ్రూ యువ కేంద్రం ఖమ్మం డిప్యూటీ డైరెక్టర్ సీహెచ్.అన్వేష్ సూచించారు. అత్యవసర పరిస్థితులు, సంక్షోభ సమయాల్లో కీలకపాత్ర పోషించే అవకాశమున్నందున యువత ముందుకు రావాలని సూచించారు. ప్రథమ చికిత్స, అత్యవసర సంరక్షణ, ట్రాఫిక్ నిర్వహణ, విపత్తు ప్రతిస్పందన, పునరావాస ప్రయత్నాల్లో తోడ్పాటులో యువతకు అవకాశం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వివరాల కోసం htpps// mybharat. gov. in లేదా 94913 83832 నంబర్‌లో సంప్రదించాలని డీడీఓ ప్రకటనలో సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఇల్లెందురూరల్: మండలంలోని కొమరారం గ్రామ సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుండాల మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన కల్తి సమ్మయ్య తీవ్రంగా గాయపడ్డాడు. గుండాల నుంచి బైక్‌పై ఇల్లెందుకు వస్తుండగా సమ్మయ్యను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. స్థానికులు గమనించి క్షతగాత్రుడిని ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఐదుగురిపై కేసు నమోదు

కరకగూడెం: తంబోలా ఆడుతున్న ఐదుగురిపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. మండల కేంద్రంలో తంబోలా ఆడుతున్నారనే సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించారు. ఐదుగురిని అదుపులోకి తీసుకోగా, మరికొందరు పరారయ్యారు. ఐదు సెల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనం, రూ.1500 నగదు స్వాధీనం చేసుకున్నారు. పరారైన వారిని కూడా పట్టుకుంటామని కరకగూడెం ఎస్‌ఐ నాగేశ్వరరావు తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,058

సమ్మెకు సన్నద్ధం



సింగరేణి సీఎండీ బలరామ్‌కు సమ్మె నోటీస్ ఇస్తున్న జేఏసీ నాయకులు (ఫైల్)

ఈ నెల 20న సమ్మెకు పిలుపునిచ్చిన కార్మిక సంఘాలు

- ఇప్పటికే ఉన్నతాధికారులకు నోటీసులు అందజేసిన నాయకులు
- నిలువరించే ప్రయత్నాల్లో సింగరేణి యాజమాన్యం

సింగరేణి(కొత్తగూడెం): ఈ నెల 20న దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగ పరిశ్రమల పరిరక్షణకు జాతీయ కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ క్రమంలో సింగరేణిలో కూడా సమ్మె విజయవంతానికి సీఎండీతో సహా మిగతా అన్ని ఏరియాల్లో ఆయా ఉన్నతాధికారులకు కార్మిక సంఘాల జేఏసీ (హెచ్‌ఎంఎస్, ఐఎఫ్‌టీయూ, టీయూసీఐ, ఏఐఎఫ్‌టీయూ, టీఎన్‌టీయూసీ, ఎస్‌జీకేఎస్) సమ్మె నోటీస్ అందజేసింది. జాతీయ కార్మిక సంఘాలైన ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎన్‌టీయూసీలు కూడా వేరుగా సింగరేణి ఉన్నతాధికారులకు సమ్మె నోటీస్ అందజేశాయి.

ఇవీ కార్మిక సంఘాల డిమాండ్లు

బొగ్గు పరిశ్రమ రక్షణ, నూతన బొగ్గు గనుల ఏర్పాటు, నాలుగు లేబర్‌కోడ్‌ల రద్దు, కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు, సమాన పనికి సమాన వేతనం తదితర 17 డిమాండ్ల పరిష్కరించాలని కార్మిక సంఘాలు కోరుతున్నాయి. సింగరేణి బొగ్గు బ్లాకులను అమ్మకానికి పెట్టొద్దని, సంస్థను ప్రైవేట్ పరం చేయాలనే యోచనను విరమించుకోవాలని, నూతన భూగర్భ గనులకు అనుమతించి నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి. సింగరేణి లోపనిచేస్తున్న 32 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులకు కోలిండియా మాదిరిగా వేతనాలుచెల్లించాలని కోరుతున్నాయి. కాంట్రాక్ట్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఖాళీగాఉన్న క్వార్టర్లను కాంట్రాక్ట్ కార్మికులకు కేటాయించాలని, ఈఎస్‌ఐ అమలు చేయాలని, సీఎంపీఎఫ్ పాస్‌పుస్తకాలు అందజేయాలని విజ్ఞప్తి చేస్తున్నాయి.

సమ్మె విజయవంతానికి కృషి



జాతీయ సంఘాల పిలుపు మేరకు సింగరేణిలో సమ్మె విజయవంతానికి కృషి చేస్తున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ట్యాక్స్‌ల రూపంలో సింగరేణి నుంచి రూ.కోట్లు తీసుకుంటూ, సింగరేణి ప్రైవేటీకరణకే కుట్ర పన్నుతున్నాయి.

– రియాజ్ అహ్మద్, హెచ్‌ఎంఎస్ జనరల్ సెక్రటరీ

పదేళ్లలో ఒక్క గనీ రాలేదు



2014 నుండి 2023 వరకు కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పాలనలో సుమారు 20 వేల మేర కార్మికుల సంఖ్య తగ్గింది. ఒక్క కొత్త గని కూడా ప్రారంభించలేదు. ప్రశ్నించేవారిని అరెస్ట్ చేసి జైళ్లకు పంపుతున్నాయి.

– సంజీవ్, ఇఫ్టూ నాయకుడు

లేబర్ కోడ్లు రద్దుచేయాలి



కేంద్రం 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా మార్చింది. ఈ కోడ్లను రద్దు చేయాలి. సంస్థలోని ఖాళీ క్వార్టర్లను కాంట్రాక్ట్ కార్మికులకు కేటాయించాలి. కనీస సౌకర్యాలు మెరుగు పరచాలి.

– పెద్దబోయిన సతీష్, రీజియన్ కార్యదర్శి, టీయూసీఐ

సమ్మె సరికాదు..



సింగరేణిలో ఒక్క రోజు సమ్మె చేస్తే 2.20 లక్షల టన్ను బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలుగుతుంది. రూ. 80 కోట్ల మేర నష్టం వాటిల్లుతుంది. ఈ పరిస్థితుల్లో కార్మిక సంఘాల సమ్మె సరికాదు.

-కె.వెంకటేశ్వర్లు, సింగరేణి డైరెక్టర్ (పా)

అందరి చూపూ ఖమ్మం వైపే..

- ఉమ్మడి జిల్లాను అభివృద్ధి చేస్తున్న ముగ్గురు మంత్రులు
- ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రామసహాయం రఘురాంరెడ్డి
- రూ.2.40 కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం



సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న ఎంపీ రఘురాంరెడ్డి, ఎమ్మెల్యే ఆదినారాయణ తదితరులు

అశ్వారావుపేటరూరల్: రాష్ట్రంలోని అన్ని జిల్లాల వారంతా ఉమ్మడి ఖమ్మం జిల్లా వైపే చూస్తున్నారని, ఇక్కడి ముగ్గురు మంత్రులు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే అందుకు కారణమని ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి అశ్వారావుపేట, దట్టమైన అటవీ ప్రాంతంలోని గిరిజన గ్రామాల్లో పర్యటించారు. తొలుత మున్సిపాలిటీ పరిధిలోని పేరాయిగూడెంలో రూ.1.32 కోట్లు, ఎమ్మెల్యే దత్తత గ్రామమైన చెన్నాపురంలో రూ.1.07 కోట్లతో నిర్మించిన 25 సీసీ రోడ్లను ప్రారంభించారు. అనంతరం కావడిగుండ్ల, చెన్నాపురం గ్రామాల్లో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఓర్వలేక బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేయడమే తన అజెండా అని అన్నారు. నియోజకవర్గంలో రూ.97 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు సాగుతున్నాయని తెలిపారు. త్వరలోనే దత్తత గ్రామాన్ని సోలార్ గ్రామంగా మార్చుతానని, ప్రణాళికలు రూపొందించాలని ఎంపీడీఓ, ఐకేపీ అధికారులకు సూచించారు. పిల్లలను విద్యకు దూరం చేయవద్దని, బడి మానేస్తే తిరిగి చేర్పించాలని లేని పక్షంలో మీ గ్రామంలో అభివృద్ధి నిలిపేస్తానని పేర్కొన్నారు.

అనంతరం ఎంపీ, ఎమ్మెల్యే శ్రీ గుబ్బల మంగమ్మ తల్లి ఆలయాన్ని సందర్శించి, అమ్మవారికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు వనం కృష్ణప్రసాద్, డాక్టర్ ప్రదీప్ కుమార్, ప్రవీణ్‌కుమార్, శ్రీధర్, అక్షిత, ప్రకాశ్, సీఐ నాగరాజు, ఎస్సై యయాతి రాజు, సొసైటీ చైర్మన్ సీహెచ్ సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు జూపల్లి రమేష్, తుమ్మా రాంబాబు, సుంకవల్లి వీరభద్రరావు, అల్లాడి రామారావు, మిండా హరి, నార్లపాటి దివాకర్, కర్నాటి శ్రీను పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రామసహాయం రఘురాంరెడ్డి, ఎమ్మెల్యే జారే ఆది నారాయణ అన్నారు. సోమవారం అశ్వారావుపేట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవ వేడుకల్లో కేక్ కట్ చేసి పంచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్య రంగంలో నర్సుల సేవలకు వెలకట్టలేమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జూపల్లి రమేష్, తుమ్మా రాంబాబు, ఆస్పత్రి మెడికల్ సూపరింటెండ్ డాక్టర్ రాధా రుక్మిణి, డాక్టర్ విజయ్‌కుమార్, స్టాఫ్ నర్సు ప్రమీలరాణి, వీరాకుమారి, సుజాత, స్వరూప, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం దిగుమతిలో ఆలస్యం

మిల్లు ఎదుట లారీల బారులు



ఇల్లెందులోని మిల్లు వద్ద నిలిచిన ధాన్యం లారీలు

ఇల్లెందు: కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యంతో లారీలు మిల్లుల వద్దకు వస్తుండగా గోదాంల్లో స్థలం లేదని, సరిపడా హమాలీలు లేరంటూ దిగుమతిలో జాప్యం జరుగుతోంది. దీంతో రోజుల తరబడి ఆలస్యం జరుగుతుండగా తాము నష్టపోతున్నామని లారీల యజమానులు వాపోతున్నారు. ఇల్లెందు సుభాష్‌నగర్‌లోని ఓ బాయిల్డ్ రైస్ మిల్లు వద్ద సోమవారం 30 లారీల మేర నిలిచిపోయాయి. ఒకేసారి ఎక్కువ లారీలు రావడంతో తగినంత మంది హమాలీలు లేక దిగుమతిలో జాప్యం జరిగింది. అంతేకాక మిల్లుల్లో స్థలభావం మరో కారణంగా చెబుతున్నారు. అయితే, ఇల్లెందు వ్యవసాయ మార్కెట్‌లో గోదాం ఉన్నా ఉన్నతాధికారుల అనుమతి లేనిదే అక్కడకు పంపించే పరిస్థితి లేదు. కాగా, లారీ ఒక రోజు ఆగితే సుమారు రూ.8వేల వరకు నష్టం వస్తోందని యజమానులు వాపోతున్నారు. అంతేకాకడ్రైవర్లు, క్లీనర్లు తిండి, నీటికి ఇబ్బంది పడుతున్నట్లు చెబుతున్నారు. ఈ విషయమై ఇల్లెందు సివిల్ సప్లయీస్ డీటీ యాకూబ్ పాషాను వివరణ కోరగా.. ఇల్లెందు మిల్లుల్లో స్థలం కొరత, ఇతర సమస్యలతో పాటు మార్కెట్ గోదాంను ఉపయోగించుకునే అంశాన్ని అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.

నాలుగో తరగతి ఉద్యోగుల కమిటీ ఎన్నిక



నూతన కార్యవర్గం

సూపర్‌బజార్(కొత్తగూడెం): తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కంభంపాటి రమణ(పాలిటెక్నిక్), సహ అధ్యక్షుడిగా ఓ హరిబాబు(ఐసీడీఎస్), ఉపాధ్యక్షులుగా జి చంద్రశేఖర్(డీసీఓ ఆఫీస్), ఈ నవీన్ (డీటీఓ ఆఫీస్), కార్యదర్శిగా కె.దినేష్ (ఏఎస్‌డబ్ల్యూఓ ఆఫీస్), సంయుక్త కార్యదర్శులుగా ధనలక్ష్మి(డీసీఓ ఆఫీస్), కృష్ణ(ఆర్అండ్‌బీ), కోశాధికారిగా వి.నరేందర్(ఇరిగేషన్), కార్యనిర్వాహక కార్యదర్శిగా వి సుధాకర్(డీపీఓ ఆఫీస్), ప్రచార కార్యదర్శిగా కె.వెంకటేష్(ఉద్యానశాఖ), ఆఫీస్ కార్యదర్శిగా డి.రాము(డీపీఆర్ఓ ఆఫీస్), కార్యవర్గ సభ్యులుగా సీహెచ్ కవిత (డీఎస్‌డీఓ ఆఫీస్), ఎస్.జయమ్మ(కొత్తగూడెం ఐటీఐ), విజయ(ల్యాండ్ సర్వే కార్యాలయం) ఎన్నికయ్యారు. సమావేశానికి కేంద్ర సంఘం నుంచి ప్రధాన కార్యదర్శి ఖాదర్‌బిన్ హసన్, సహ అధ్యక్షుడు బి.రాజేందర్, కార్యదర్శి కె.కృష్ణవేణి, కోశాధికారి కె.ధన్‌రాజ్ హాజరయ్యారు. ఈ కమిటీ మూడేళ్లపాటు కొనసాగుతుందని నాయకులు తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్‌ను కలిసి నూతన కమిటీ వివరాలను వివరించారు.

సమ్మెకు జాతీయ కార్మిక సంఘాల మద్దతు



అఖిల పక్ష సమావేశానికి హాజరైన నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): ఈ నెల 20న జరిగే సమ్మెకు అన్ని జాతీయ కార్మిక సంఘాలు మద్దతు తెలుపుతున్నాయని అఖిల పక్ష నాయకులు పేర్కొన్నారు. సోమవారం రుద్రంపూర్‌లోని ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన అఖిల పక్ష సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు. ఐఎన్‌టీయూసీ, టీబీజీకేఎస్, సీఐటీయూ, ఇఫ్టూ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సాగులో మెళకువలపై అవగాహన



మాట్లాడుతున్న కోఆర్డినేటర్ రవికుమార్

వైరారూరల్: 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో భాగంగామండలంలోని ఖానాపురం రైతు వేదికలో సోమవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వైరా కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్ మాట్లాడుతు యూరియా వాడకం తగ్గింపు, తద్వారానేల ఆరోగ్య పరిరక్షణపై వివరించారు. అనంతరం ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ వి.చైతన్య, వైరా ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ వివిధ అంశాలపై మాట్లాడారు.ఏఓ మయాన్ మంజుఖాన్, తల్లాడ వెటర్నరీ వైద్యులు అనాస్, విత్తన అభివృద్ధి అధికారి అక్షిత, ఏఈఓలు సపావత్ సైదులు, ఆలూరి వాసంతి, వెంపటి కీర్తి, మేడా రాజేష్, పరిటాల వెంకటనర్సయ్యతో పాటు నల్లమల వెంకటేశ్వరరావు, షేక్ రఫీ, షేక్ లాల్ మహ్మద్, తుమ్మల రాణాప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక నిల్వలకు అడ్డాగా గోదావరి వరదకట్ట

అధికారుల తీరుపై రైతుల ఆగ్రహం



కుదునూరు సమీపాన గోదావరి వరదకట్టపై డంప్ చేసిన ఇసుక

చర్ల: గోదావరి కరకట్ట పైనుంచి సాగునీటి కోసం తాము పైపులు ఏర్పాటు చేసుకుంటే అధికారులు అభ్యంతరం వ్యక్తం చేయగా, ఇప్పుడు నది నుంచిడీసిల్టింగ్ పేరిట లక్షలాది క్యూబిక్ మీటర్ల ఇసుకను తీస్తూ కరకట్టపై డంపింగ్ చేస్తుంటే చర్యలు తీసుకోకపోవడంపై రైతులు మండిపడుతున్నారు. మండలంలోని కుదునూరు సమీపానగోదావరి నదిలో ఇటీవల రెండు ఇసుకక్వారీలు ప్రాంభమయ్యాయి. ఒకటి సొసైటీక్వారీ కాగా మరొకటి డీసిల్టింగ్ పేరిటప్రారంభమైంది. ఈ క్వారీల నుంచి పెద్దఎత్తున ఇసుకను భారీ యంత్రాలతో తవ్వుతూఒడ్డుకు చేరుస్తున్నారు. నిల్వ చేయడానికిరైతుల భూములను లీజుకు తీసుకున్నా,గోదావరి వరద కట్టను కూడా యార్డుగామార్చుకుని వందలాది లారీల ఇసుకను నిల్వచేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. రెండేళ్లక్రితం సీతమ్మసాగర్ వరద కరకట్ట పనులు చేపట్టిన సమయంలో కంటెపల్లి, కుదునూరుగ్రామాలకు చెందిన రైతులు గోదావరి నుంచిమోటార్ల ద్వారా పంటలకు నీటి కోసం కరకట్టపైనుంచి తాత్కాలికంగా ప్లాస్టిక్ పైపులు ఏర్పాటుచేస్తే అధికారులు అభ్యంతరం తెలిపారు. కానీ ఇప్పుడు ఇసుక డంప్‌పై పట్టించుకోకపోవడం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై ఇరిగేషన్ కొత్తగూడెం ఎస్ఈ శ్రీనివాసరెడ్డిని వివరణ కోసం ఫోన్‌లో ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

అందుబాటులోకి పచ్చిరొట్ట విత్తనాలు

- ఉమ్మడి జిల్లాలో 4,422 క్వింటాళ్ల విత్తనాలు సిద్ధం
- 50 శాతం మేర సబ్సిడీతో విక్రయం
- పీఏసీఎస్‌లు, ఆగ్రో రైతుసేవా కేంద్రాల ద్వారా అమ్మకం



జనుము పంట(ఫైల్)

ఖమ్మంవ్యవసాయం: వానాకాలం సీజన్ సమీపిస్తున్న వేళ ప్రభుత్వం పచ్చిరొట్ట విత్తనాలను అందుబాటులోకి తీసుకొస్తోంది. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఖమ్మం ప్రాంతీయ కార్యాలయం నుంచి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు విత్తనాల పంపిణీ ప్రారంభమైంది. అక్కడక్కడా కురుస్తున్న వర్షాలతో రైతులు దుక్కులు చేస్తున్నారు. ఈ నేపథ్యాన భూసారం పెంపునకు పంటల సాగుకు ముందు పచ్చిరొట్ట విత్తనాలు చల్లి ఆపై కలియదున్నడం ఆనవాయితీ. ఈక్రమంలోనే వ్యవసాయ శాఖ జీలుగు, పిల్లి పెసర, జనుము తదితర పచ్చిరొట్ట పైర్ల పెంపకానికి ప్రాధాన్యత ఇస్తోంది. ఇందుకు అనుగుణంగా విత్తనాభివృద్ధి సంస్థ విత్తనాలను అందుబాటులోకి తీసుకొస్తోంది.

వ్యవసాయ శాఖ ఇండెంట్ ఆధారంగా..

ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం జిల్లాల వ్యవసాయ శాఖ నుంచి అందిన ఇండెంట్ ఆధారంగా పచ్చిరొట్ట విత్తనాలను విత్తనాభివృద్ధి సంస్థ సమకూరుస్తోంది. ఖమ్మం జిల్లాలో జీలుగు 14వేల క్వింటాళ్లు, జనుము 1,500 క్వింటాళ్లు, పిల్లిపెసర 150 క్వింటాళ్లు, భద్రాద్రి జిల్లాలో జీలుగు 5వేల క్వింటాళ్లు, జనుము 400 క్వింటాళ్లు, పిల్లి పెసర 50 క్వింటాళ్లకు కావాలని నివేదిక ఇచ్చారు. ఇందులో ఇప్పటివరకు జీలుగు 3,252 క్వింటాళ్లు, జనుము 1,170 క్వింటాళ్లు కలిపి 4,422 క్వింటాళ్ల విత్తనాలు తెప్పించారు.

సబ్సిడీతో విక్రయాలు

సహజసిద్ధమైన ఎరువు లభించేలా పచ్చిరొట్ట పంటల సాగును ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం.. విత్తనాలపై 50 శాతం సబ్సిడీపై రైతులకు అందిస్తోంది.

విత్తనాల బ్యాగ్ పరిమాణం, ధరలు

విత్తనంబ్యాగ్	(కిలోల్లో)	ధర (రూ.ల్లో)
జీలుగు	30	2,137.50
జనుము	40	2,510.00
పిల్లి పెసర	20	2,055.00

కిలో రూ.142.75 ధర ఉన్న జీలుగు విత్తనాలను రూ.71.25కు, రూ.125.50 ధర ఉన్న జనుము విత్తనాలను రూ.62.75కు, రూ.205.50 ధర ఉన్న పిల్లి పెసర విత్తనాలను రూ.102.50కు విక్రయిస్తారు. ఖమ్మం జిల్లాలోని 75 పీఏసీఎస్‌లు, 13 ఆగ్రో రైతు సేవా కేంద్రాలు, రెండు టీజీఎస్‌డీఎల్, ఒక ట్రేడర్‌తో పాటు భద్రాద్రి జిల్లాలో 20 పీఏసీఎస్‌లు, ఏడు ఆగ్రో రైతు సేవా కేంద్రాలు, ఒక ట్రేడర్ ద్వారా విత్తనాలను విక్రయానికి ఏర్పాట్లు చేశారు.

విత్తనాలు సిద్ధం..



ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం జిల్లాల్లో వ్యవసాయ శాఖ ఇచ్చిన ఇండెంట్ ఆధారంగా పచ్చిరొట్ట విత్తనాలను అందుబాటులోకి తెప్పిస్తున్నాం. ఇప్పటికే చేరుకున్న జీలుగు, జనుము విత్తనాలను నిర్దేశిత కేంద్రాలకు పంపించాం. 50 శాతం సబ్సిడీపై విక్రయించేలా పర్యవేక్షించనున్నాం.

– ఎస్ భిక్షం, విత్తనాభివృద్ధి సంస్థ ప్రాంతీయ మేనేజర్, ఉమ్మడి ఖమ్మం జిల్లా

రెండు కేజీల గంజాయి స్వాధీనం

ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

కారేపల్లి: గంజాయితో వెళ్తు న్న ఇద్దరిని కారేపల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రెండు కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. పోలీసులు వెల్లడించిన వివరాలు... ఇల్లెందుకు చెందిన వలిపెద్ది రాజ్‌కమల్, కొత్తగూడెంలోని చుంచుపల్లికి చెందిన కుంజా దిలీప్ చెరో కేజీ గంజాయి సంచులతో ఖమ్మం వెళ్లేందుకు సోమవారం కారేపల్లి వద్ద వేచి ఉన్నారు. ఈక్రమంలో సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి, ఎస్ఐ ఎన్.రాజారాం ఆ మార్గంలో వెళ్తుండగా పోలీసులను చూసిన రాజ్‌కమల్, దిలీప్ పరుగుపెట్టారు. దీంతో వెంబడించి పట్టుకోగా, రెడు కేజీల గంజాయి లభించింది. ఇల్లెందుకు చెందిన రాజ్‌కమల్ 2017లో సోలార్ ప్లాంట్ వద్ద జరిగిన ఓ హత్య కేసులో నిందితుడు కాగా, బెయిల్‌పై వచ్చాక కోర్టు వాయిదాలకు హాజరు కాకపోవడంతో అరెస్టు వారెంట్ జారీ చేసింది. ప్రస్తుతం దిలీప్‌తో కలిసి ఆయన గంజాయి తీసుకెళ్తూ పట్టుబడ్డాడు.

గాయపడ్డ బాలుడికి చికిత్స



చికిత్స పొందుతున్న బాలుడు

భద్రాచలంఅర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అల్లూరి సీతారామరాజు జిల్లా డొంకరాయికి చెందిన బాలు డు సృజన్ రెడ్డికి భద్రాచలం ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈ నెల 8న బైక్ ఆవును ఢీకొన్న ఘటనలో బాలుడు ఎడమ కన్ను పైభాగంలో తీవ్ర గాయాలయ్యా యి. దీంతో మెరుగైన వైద్యం కోసం భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తీసుకురాగా, డాక్టర్లు కుట్లు వేసి చికిత్స అంది స్తున్నారు. బాలుడు ఆరోగ్యంగానే ఉన్నాడని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

బూర్గంపాడు: ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను సోమవారం పోలీసులు పట్టుకున్నారు. కిన్నెరసాని నుంచి ఇసుక తరలిస్తుండగా సంజీవరెడ్డిపాలెం గ్రామం వద్ద పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ యజమానులపై, డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

పాల్వంచరూరల్: అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేస్తున్న భర్త, అత్త, మామలపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని కేశవాపురం గ్రామానికి చెందిన మోత్కూరి మాధవికి సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల గ్రామానికి చెందిన రమణాచారితో 2014లో వివాహం జరిగింది. వీరికి ఒక పాప ఉంది. కొంతకాలంగా భర్తతోపాటు అత్త అనసూర్య, మామ వెంకటేశ్వర్లు అదనపు కట్నం వేధిస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు.